సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 23 । సెప్టెంబర్ । 2023



చీనీ టన్ను రూ.21 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠ ధర రూ.21 వేలు పలికాయి. మార్కెట్‌కు 35 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.8
కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ఠ ధర రూ.8 పలికింది. కనిష్ఠం రూ.2.50, సరాసరిన రూ.6 ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్ఠం/కనిష్ఠం
37.8°/22.3°
జిల్లాలో శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

ఎంసీఏ, ఎంబీఏ ఫలితాలు విడుదల



జేఎన్‌టీయూ అనంతపురం పరీక్ష భవనం

అనంతపురం: జేఎన్‌టీయూ (అనంతపురం) పరిధిలో ఆగస్టు, సెప్టెంబర్‌లో నిర్వహించిన ఎంసీఏ నాలుగో సెమిస్టర్ (ఆర్‌–21) రెగ్యులర్, ఎంసీఏ నాలుగు, ఐదో సెమిస్టర్ (ఆర్‌–17) సప్లిమెంటరీ ఫలితాలు, ఎంబీఏ నాలుగో సెమిస్టర్ (ఆర్‌–21) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ బి.చంద్రమోహన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పరీక్ష ఫలితాలను జేఎన్‌టీయూఏ వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చన్నారు.

మొబైల్ వెటర్నరీ క్లినిక్‌లో ఉద్యోగాలు



అనంతపురం అగ్రికల్చర్: శ్రీసత్యసాయి జిల్లాలో వైఎస్సార్ మొబైల్ అంబులేటరీ క్లినిక్ డాక్టర్, డ్రైవర్ పోస్టులకు ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని 1962 హెల్ప్‌లైన్ జిల్లా కో ఆర్డినేటర్ రామకృష్ణగౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. డాక్టర్ పోస్టుకు బీవీఎస్సీ లేదా ఎంవీఎస్సీ చేసి ఉండాలని తెలిపారు. నెలకు రూ.40వేల వేతనంతో పాటు పీఎఫ్, ఈఎస్‌ఐ సదుపాయం ఉంటుందని పేర్కొన్నారు. డ్రైవర్ పోస్టులకు పదో తరగతి పాసై ఉండాలని తెలిపారు. హెచ్‌ఎంవీ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలన్నారు. పీఎఫ్, ఈఎస్‌ఐ పోనూ నెలకు రూ.10,800 వస్తుందన్నారు. మరిన్ని వివరాలకు 96525 33554, 83740 77951 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

జవాబుపత్రం ఫొటో తీసి కటకటాల పాలు



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని పరీక్షల విభాగంలో మూల్యాంకనం చేయాల్సిన జవాబుపత్రాలను సెల్‌ఫోన్‌లో ఫొటో తీసి ఒక ఉద్యోగి కటకటాలపాలయ్యారు. పరీక్షల విభాగంలో వీర భద్రయ్య అనే వ్యక్తి డైలీవేజ్ కింద పని చేస్తున్నారు. ఇతను గురువారం జవాబుపత్రాలను తన సెల్‌ఫోన్‌తో ఫొటోలు తీస్తుండడంతో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ శ్రీరాములునాయక్ గమనించారు. అతడివద్దకెళ్లి సెల్‌ఫోన్ లాక్కున్నారు. అయితే ఆ సమయంలో వీసీ అందుబాటులో లేరు. దీంతో శుక్రవారం ఉదయం అతడిని వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి బంగ్లా వద్దకు తీసుకెళ్లి హాజరుపరిచారు. ఫొటోలు ఎందుకు తీశావని అడిగితే, సరైన సమాధానం ఇవ్వలేదు. ఘటనపై ఇటుకలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరభద్రయ్యను పోలీసులు అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు.

25లోపు బయోమెట్రిక్ వివరాలు పంపాలి



అనంతపురం రూరల్: కేంద్ర ప్రభుత్వం 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి అందించే మైనార్టీ ఉపకార వేతనాల కోసం విద్యార్థుల బయోమెట్రిక్ వివరాలను ఈ నెల 25లోపు జిల్లా నోడల్ అధికారి లాగిన్‌కు పంపాలని ఉమ్మడి జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మహమ్మద్‌రఫీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 7,006 మంది విద్యార్థులు స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోగా.. వారిలో ఇప్పటివరకు 4,287 మంది వివరాలను మాత్రమే జిల్లా నోడల్ అధికారి లాగిన్‌కు పంపారని పేర్కొన్నారు. మిగిలిన విద్యార్థుల వివరాలను ఈ నెల 25లోగా జిల్లా నోడల్ అధికారి లాగిన్‌కు పంపించాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లపై ఉందన్నారు.

వినాయకా... వీడ్కోలిక!

- కోలాహలంగా సాగిన వినాయక నిమజ్జనం
- 'గణేశ్ మహారాజ్‌కి జై' నినాదాలతో ప్రతిధ్వనించిన కదిరి
- ఉరకలేసిన యువత ఉత్సాహం
- ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎస్పీ మాధవరెడ్డి



కదిరి: భక్తజన సందోహం మధ్య నిమజ్జనానికి తరలుతున్న శివాలయం రైతు వినాయకుడు

కదిరి: 'గణపతి బప్పా మోరియా, గణేశ్ మహారాజ్‌కీ జై' నినాదాలతో కదిరి ప్రతిధ్వనించింది. శుక్రవారం పట్టణంలో వినాయక నిమజ్జనం కోలాహలంగా సాగింది. 'పార్వతీ తనయా..ఏక దంతా.. విఘ్న రాజా..జై జై గణేశ..'' అంటూ పెద్దలు పార్వతీ తనయుడికి వీడ్కోలు పలకగా, ''జైజై గణేశా... జై కొట్టు గణేశ..బైబై గణేశా..'' అంటూ యువత డ్యాన్సలతో హంగామా చేస్తూ ఐదురోజుల పాటు పూజలందుకున్న గౌరీ పుత్రుడిని గంగ ఒడికి చేర్చారు.

4.30 గంటలకు ప్రారంభమైన నిమజ్జనం..
చవితి రోజున పట్టణంలోని వీధి వీధిలో ఏర్పాటు చేసిన మంటపాల్లో కొలువు దీరిన ఏకదంతునికి నిర్వాహకులు శుక్రవారం ఉదయమే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వినాయకుడిని ప్రత్యేక వాహనాల్లో కొలువుదీర్చి నిమజ్జనానికి సిద్ధం చేశారు. విగ్రహాలు తరలించే వాహనాలన్నీ స్థానిక రైల్వే స్టేషన్ వద్దకు చేరుకున్నాయి. అనంతరం నృసింహాలయం వద్ద ఏర్పాటు చేసిన ఆలయ విగ్రహానికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి సరిగ్గా సాయంత్రం 4.30 గంటలకు వివిధ రాజకీయ పార్టీల నాయకులతో పాటు మత పెద్దలు రథం లాగి నిమజ్జనోత్సవాన్ని ప్రారంభించారు. నాలుగు భారీ విగ్రహాలు (సింహకోట, ఎర్రకోట, శివాలయం, రైల్వేగణేష్) ఆలంఖాన్‌వలీ మసీదు ముందు గుండా తీసుకెళ్లి 'హిందూ, ముస్లిం భాయీ భాయ్' అన్న సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఎస్పీ మాధవరెడ్డి దగ్గరుండి నిమజ్జనం బందోబస్తును పర్యవేక్షించారు. 400 మంది దాకా పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు.

ఉల్లాసం.. ఉత్సాహం
చిన్నా, పెద్దా, ఆడ, మగ, హిందూ, ముస్లిం, క్రిస్టియన్ అనే తేడా లేకుండా పట్టణ ప్రజలు గణేశ్ నిమజ్జనంలో పాల్గొన్నారు. ముఖ్యంగా యువకుల్లో ఉత్సాహం ఉరకలెత్తింది. వినాయక విగ్రహాల ఎదుట డ్యాన్సులతో హోరెత్తించారు. బాణసంచా వెలుగులు ఆకాశాన కాంతులీనుతుండగా అందరూ రంగులు చల్లుకొని సందడి చేశారు. భక్త జనుల గణేశ నామస్మరణల మధ్య పార్వతీ తనయుడిని స్థానిక పెనుకొండరాయుని చెరువులో క్రేన్‌ల సాయంతో నిమజ్జనం చేశారు. పట్టణంలోని వేమారెడ్డి కూడలిలో పూల వ్యాపారులు భక్తులకు అన్నదానం చేశారు. నిమజ్జనం ప్రశాంతంగా జరిగినందుకు కదిరి డీఎస్పీ ఎం.శ్రీలత, ఇతర అధికారులు పట్టణ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

అనంతపురం: సప్తగిరి సర్కిల్‌లో గణేశ్ శోభాయాత్రకు తరలివచ్చిన భక్తజనం



అనంతలో నిమజ్జనోత్సవం

అనంతపురం కల్చరల్: వినాయక చవితి ఉత్సవాల్లో కీలక ఘట్టం నిమజ్జనం అనంతపురంలో ఉత్సాహంగా సాగింది. వాడవాడలా మంటపాల్లో కొలువుదీరిన గణేశుడిని ఐదురోజులపాటు ప్రత్యేక పూజలు, నైవేద్యాల సమర్పణ అనంతరం శుక్రవారం నిమజ్జనానికి తరలించారు. నగరంతో పాటు జిల్లా అంతటా వినాయక విగ్రహాలను సాయంత్రం నుంచే చెరువులు, కుంటలకు తరలించడం మొదలైంది. ప్రత్యేక వాహనాల్లో తీసుకెళ్లి క్రేన్‌ల సాయంతో భారీ విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేశారు. గణపతి బప్ప మోరియ, గణేష్ మహరాజ్‌కీ జై అంటూ భక్తుల జయజయధ్వానాల నడుమ గౌరీ తనయుడు గంగమ్మ ఒడికి చేరాడు. అనంతపురంలో నిర్వహించిన శోభాయాత్రలో కోలాటాల సందడి, పౌరాణిక వేషధారుల ప్రదర్శన, వాయిద్యాల నడుమ భక్తిపారవశ్యంతో నృత్యాలు, ఈలలు, కేకలు మిన్నంటాయి. నిమజ్జనానికి ప్రభంజనంలా తరలివచ్చిన జన సందోహానికి గౌరీ తనయుడు 'మళ్లీ కలుస్తా' అంటూ సాగిపోయాడు.



నిమజ్జనానికి తరలుతున్న గణేశుడు



నృసింహాలయ వినాయకుడి వాహనాన్ని లాగి నిమజ్జనోత్సవం ప్రారంభిస్తున్న వివిధ పార్టీల నాయకులు



కదిరిలో నిర్వహించిన గణేశ్ శోభాయాత్రలో కోలాటం ఆడుతున్న మహిళలు



నిమజ్జనానికి తరలుతున్న మారుతి నగర్ మత్స్యగణపతి



నిమజ్జనం సందర్భంగా కదిరిలో నిర్వహించిన శోభాయాత్రలో నృత్యాలు చేస్తున్న యువకులు



పెనుకొండ రాయుని చెరువులో గణేశుడి నిమజ్జనం

ప్రజారోగ్య మస్తు

ప్రజల ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. 'జగనన్న ఆరోగ్య సురక్ష' పేరిట మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రజల చెంతకే వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి, అనారోగ్యంతో ఉన్న వారి కోసం స్థానికంగానే వైద్య శిబిరాలు నిర్వహించి వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టింది.

- 'అనంత'లో ఇప్పటికే 1.53 లక్షల మందికి వైద్య పరీక్షలు
- శ్రీసత్యసాయి జిల్లాలో 1.18 లక్షల మందికి టెస్టులు
- ఈ నెల 30 నుంచి శిబిరాల నిర్వహణకు ఏర్పాట్లు
- అత్యధికంగా హైపర్ టెన్షన్, మధుమేహ బాధితులకు టెస్టులు
- సీఎం ఆదేశాలతో ఇంటింటా తిరుగుతున్న ఆరోగ్య సిబ్బంది

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం స్పీడు పెరిగింది. ఈ నెల 30 నుంచి అన్ని మండల కేంద్రాల్లో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్న తరుణంలో రోగులను గుర్తించేందుకు ఆరోగ్య సిబ్బంది జల్లెడ పడుతున్నారు. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారిని గుర్తించి, వారికి క్రమం తప్పకుండా మందులిస్తారు. రక్తపోటు, మధుమేహం, మూర్ఛ, క్యాన్సర్, గుండె జబ్బులు, నరాల జబ్బులు వంటి వాటిని గుర్తించి రెఫరల్ ఆస్పత్రులకు పంపిస్తారు. దీనికోసం వేలాది మంది సిబ్బంది ప్రతి ఇంటికీ తిరిగి ప్రజల ఆరోగ్య వివరాలు నమోదు చేస్తున్నారు.

భారీగా వైద్య పరీక్షలు
ఉమ్మడి జిల్లాలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'లో భాగంగా భారీగా వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈనెల 16వ తేదీనుంచి ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు ఇంటింటికీ వెళ్లి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్న విషయం తెలిసిందే. అనంతపురం జిల్లాలో 1,53,893 మందికి, శ్రీసత్యసాయి జిల్లాలో 1,18,561 మందికి నిర్ధారణ పరీక్షలు చేశారు. బాధితులను ఈ నెల 30 నుంచి నిర్వహించే ఆరోగ్య శిబిరాల్లో డాక్టర్ల వద్దకు తీసుకెళతారు. వ్యాధి తీవ్రతను బట్టి డాక్టర్లు వారికి క్రమం తప్పకుండా మందులు అందేలా చూస్తారు. ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి మందులు ఉచితంగా పంపిణీ చేస్తారు. 30న జరిగే వైద్యశిబిరాల కోసం ఈ నెల 25న మాక్ క్యాంప్‌లు ఏర్పాటు చేస్తున్నారు.



రొళ్ల మండలం హొట్టేబెట్టలో ఇంటి వద్దనే రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

వైద్య శిబిరాల్లో వీళ్లే ముఖ్యం
- పీహెచ్‌సీలో ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు
- ఫ్యామిలీ ఫిజీషియన్ ఉంటారు.
- వైద్యవిధాన పరిషత్ ఆస్పత్రుల స్పెషలిస్టులను డీఎంహెచ్‌ఓ మ్యాపింగ్ చేస్తారు
- బోధనాస్పత్రికి చెందిన 30 మంది డాక్టర్లు అదనంగా ఉంటారు
- ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ (ప్రైవేటు) ఆస్పత్రులకు చెందిన స్పెషలిస్టులనూ మ్యాపింగ్ చేస్తారు.
- ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, స్టాఫ్‌నర్సులు శిబిరానికి తగ్గట్లు ఉంటారు.
- వీళ్లు కాకుండా శిబిరాల నిర్వహణలో వివిధ విభాగాల అధికారులు ఉంటారు.

శ్రీసత్యసాయి జిల్లాలో ఈ నెల 20 వరకూ చేసిన టెస్టులు

కేటగిరీ	టెస్టుల సంఖ్య
హైపర్ టెన్షన్	40,773
మధుమేహం	30,071
మూత్రపరీక్షలు	1,874
హిమోగ్లోబిన్	40,474
మలేరియా	1,861
డెంగీ	1,710
కఫం పరీక్షలు	900
కఫం ఫలితాల సేకరణ	898


25 శాతం సర్వే పూర్తి



సచివాలయ పరిధిలో ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌ఎస్‌పీలు రెండు బృందాలుగా ఏర్పడి 'జగనన్న ఆరోగ్య సురక్ష' గురించి సర్వే చేస్తున్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 25 శాతం సర్వే పూర్తయింది. బీపీ, షుగరు, హిమోగ్లోబిన్, మలేరియా, డెంగీ తదితర ఏడు రకాల జబ్బులకు టెస్టులు చేస్తారని ప్రజలకు వివరిస్తున్నారు. ఏర్పాట్లను ఎంపీడీఓలు చూస్తున్నారు. స్పెషలిస్టులు కొందరు ఇప్పటికే వచ్చారు. ఒకట్రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో కొలిక్కి వస్తుంది. పెండింగ్ ప్రాంతాల్లో మ్యాపింగ్ జరుగుతోంది.
– ఎస్‌వీ కృష్ణారెడ్డి, డీఎంహెచ్‌ఓ, శ్రీసత్యసాయి జిల్లా

రేపటి నుంచి పట్టాలపైకి 'వందే భారత్'

- 8.30 గంటల్లోనే కాచిగూడ నుంచి యశ్వంతపూర్ చేరనున్న రైలు
- బుధవారం మినహా వారంలో ఆరు రోజులు నడవనున్న ఎక్స్‌ప్రెస్
- ఉమ్మడి జిల్లాలో అనంతపురం, ధర్మవరంలోనే స్టాపింగ్



హిందూపురం అర్బన్ : కాచిగూడ–యశ్వంతపూర్ మధ్య 'వందే భారత్' ఎక్స్‌ప్రెస్ రైలు ఆదివారం నుంచి పరుగులు తీయనుంది. దేశవ్యాప్తంగా 9 వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లను ప్రధాని మోదీ ఈ నెల 24వ తేదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. అందులో కాచిగూడ–యశ్వంతపూర్ మధ్య నడిచే 'వందే భారత్'కూడా ఒకటి. వారంలో బుధవారం మినహా మిగిలిన అన్ని రోజులు నడిచే ఈ రైలు కేవలం 8.30 గంటల్లోనే కాచిగూడ నుంచి యశ్వంతపూర్ చేరనుంది. ఉదయం 5.30 గంటలకు కాచిగూడ నుంచి బయలుదేరే వందేభారత్ (20703) మహబూబ్‌నగర్, కర్నూలు మీదుగా ఉదయం 10.55 గంటలకు అనంతపురానికి, 11.30 గంటలకు ధర్మవరం చేరుకుంటుంది. మధ్యాహ్నం 2.30 గంటలకు యశ్వంతపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 2.45 గంటలకు బయలుదేరనున్న వందేభారత్ (20704) సాయంత్రం 5.20 గంటలకు ధర్మవరం, 5.41 గంటలకు అనంతపురం , రాత్రి 11.15 గంటలకు తిరిగి కాచిగూడకు చేరుకుంటుంది. కాచిగూడ – యశ్వంతపూర్ మధ్య 609.81 కిలో మీటర్లు దూరం ఉండగా, అందులో సింగిల్ ట్రాక్ 213.31 కి.మీ కాగా, డబుల్ ట్రాక్ 396 .50 కి.మీ ఉంది. వందేభారత్ సగటున 71.74 కి.మీ వేగంతో దూసుకువెళ్లనుంది. భోజన సదుపాయంతో కలిపి ఎగ్జిక్యూటివ్ చైర్ కార్ టికెట్ ధర రూ. 2,425 కాగా, ఏసీ చైర్ టికెట్ రూ. 1,545గా నిర్ణయించారు.

ప్రతి సమస్యనూ పరిష్కరిస్తాం



కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న సంచార జాతుల మహిళలు

- ప్రజల సౌకర్యార్థమే మండల స్థాయిలో 'జగనన్నకు చెబుదాం'
- కలెక్టర్ పి.అరుణ్‌బాబు

కొత్తచెరువు: క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొనే ప్రతి సమస్యకూ పరిష్కారం చూపేందుకే 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని మండల స్థాయిలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. శుక్రవారం ఆయన కొత్తచెరువు తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని వెలుగు భవనంలో నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం' స్పందన కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 108 అర్జీలు అందగా, పరిష్కారం కోసం వాటిని ఆయా శాఖలకు పంపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారంలో పూర్తి బాధ్యత అధికారులదేనన్నారు. అందే ప్రతి అర్జీని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. పరిష్కరించలేని అర్జీలు ఏవైనా ఉంటే ఆ విషయాన్ని అర్జీదారులకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. అర్జీల పరిష్కార ప్రక్రియలో అధికారులు ఏ దశలోనూ అలసత్వం ప్రదర్శించవద్దన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసమే గతంలో నియోజకవర్గ స్థాయిలో స్పందన కార్యక్రమం నిర్వహించామని, ప్రస్తుతం ప్రతి బుధ, శుక్రవారాల్లో మండల స్థాయిలో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాలు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. అనంతరం స్థానిక పశు వైద్యశాఖలను కలెక్టర్ తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ కార్తీక్, డీఆర్‌ఓ కొండయ్య ఆర్డీఓ భాగ్యరేఖ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, తహసీల్దార్ రామాంజినేయులు రెడ్డి, ఎంపీడీఓ బారాన్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సంచార జాతుల కృతజ్ఞతలు..
ఏళ్లుగా ఆధార్ కార్డు మంజూరు కాక ఇబ్బందులు పడిన 54 సంచారజాతుల కుటుంబాలకు కలెక్టర్ అరుణ్‌బాబు ఇటీవలే ఆధార్‌కార్డు మంజూరు చేయించారు. దీంతో వారంతా శుక్రవారం కలెక్టర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, పిల్లలను బాగా చదివించాలని కలెక్టర్ ఈ సందర్భంగా వారికి సూచించారు. అంతకుముందు కొత్తచెరువు ఎంపీపీ గాయత్రి, ఉపాధ్యక్షురాలు వడ్డె సరళ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు మటన్ శంకర్, రెడ్డప్పరెడ్డి తదితరులు కలెక్టర్ అరుణ్‌బాబుకు పుష్పగుచ్ఛాలు అందించారు.

ప్రకృతి సాగును ప్రోత్సహిస్తాం

- వంద శాతం సబ్సిడీతో పీఎండీఎస్ కిట్ల పంపిణీ
- ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సారయ్య, అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల

ధర్మవరం రూరల్: రైతులకు మేలు చేసే ప్రకృతి వ్యవసాయాన్ని మరింత ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సారయ్య, జిల్లా అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి తెలిపారు. శుక్రవారం ధర్మవరం మండల పరిషత్ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా వంద శాతం సబ్సిడీతో పీఎండీఎస్ కిట్లును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సారయ్య, అవుటాల రమణారెడ్డి మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న జిల్లాలోని 1,772 మంది షెడ్యూల్ కులాలకు చెందిన రైతులకు విత్తనాలు, వ్యవసాయ ఉపకరణాలు పంపిణీ చేశామన్నారు. ఒక్కో రైతుకు రూ.10 వేల విలువైన సామగ్రిని జిల్లా షెడ్యూల్ కులాల సేవా సహకార సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో పంపిణీ చేసినట్లు వెల్లడించారు. పీఎండీఎస్ పథకం ద్వారా కందులు, పెసలు, వేరుశనగ, రాగులు, కొర్రలు, సజ్జలు, మొక్కజొన్న, కిచెన్ గార్డెన్ కూరగాయల కిట్లు, టార్పాలిన్లు అందించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ రమాదేవి, ఎంపీడీఓ సౌజన్యకుమారి, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కేశవరెడ్డి, శంకరయ్య, ముస్తఫా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అవుటాల రమణారెడ్డి

రెండు తలలు.. ఎనిమిది కాళ్లు



మరణించిన రెండు తలలు, ఎనిమిది కాళ్ల దూడ

ఆత్మకూరు: ఆత్మకూరుకు చెందిన బయపరెడ్డి అనే రైతుకు సంబంధించిన ఎనుముకు శుక్రవారం రెండు తలలు, ఎనిమిది కాళ్లు ఉన్న దూడ జన్మించింది. రైతు తెలిపిన వివరాల మేరకు... ఎనుము దూడను ప్రసవించేందుకు తీవ్ర ఇబ్బందులు పడింది. దాదాపు నాలుగు గంటల సమయం పట్టింది. 15 మంది కలసి దూడను బలవంతంగా బయటకు తీశారు. కాని అప్పటికే కడుపులోనే దూడ మరణించిందని రైతు తెలిపారు.

HINDUPUR MUNICIPALITY

EXPRESSION OF INTEREST (E.O.I)

EOI .No. 258/2023/E1, dated: 12.09.2023.

Expression of Interest (E.O.I) is invited by the undersigned from the Registered companies / Consultants having Registration in Govt. of A.P. and experience in similar nature of work for Preparation of Detailed Project Report for the proposed Independent **Providing Sewerage Scheme in Hindupur Municipality** as source to Hindupur Municipality duly conducting Detailed Investigation, Preparation of designs, Estimates etc., complete as per department directions.

1. Last date for Receipt of application along with Schedule cost of Rs.2000/- - 07.10.2023 upto 2.00 PM
2. Date of issue of Schedule - 23.09.2023
3. Last date for receipt of schedule (EOI) Along with EMD of Rs: 10,000/- - 07.10.2023 upto 2.00 PM
4. Opening date - 07.10.2023 upto 4.00 PM

For further details contact Cell No. 9849907408

Sd/- Commissioner, Hindupur Municipality

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
రీజినల్ బిజినెస్ ఆఫీస్-4, ధర్మవరం

బంగారు నగల వేలం ప్రకటన

ఇందుమూలముగా తెలియజేయడం ఏమనగా "స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా" ఈ క్రింది బ్రాంచీలలో "బంగారు నగలు" తాకట్టుపెట్టి అప్పు తీసుకొన్న ఈ దిగువ తెలిపిన ఖాతాదారులు గడువు మీరినమా, పలుమార్లు కోరినమా, అప్పు తిరిగి చెల్లించనందులకు రిజర్వు బ్యాంకు వారి నిబంధనల ప్రకారం దిగువ కనబరచిన షెడ్యూలు ప్రకారం **30-09-2023 తేది శనివారం సా॥ 4-30 గం॥లకు ఆయా బ్రాంచిల ఆవరణలలో బహిరంగ వేలము వేయబడును.**

క్ర. సం.	ఖాతాదారుని పేరు, చిరునామా	అకౌంట్ నెంబర్	అప్పుమొత్తం (సుమారుగా) రూ॥
	ADB కదిరి బ్రాంచ్ మేనేజర్, మొబైల్ నెం. 9959550015		
1.	అరుణకుమారి రొద్దం భర్త ఆర్. చంద్రశేఖర్‌రెడ్డి, డి.నెం.3/23, కుమతంపల్లి గ్రా॥&పో॥, గాండ్లపెంట మం॥, శ్రీ సత్యసాయి జిల్లా.	40963388919	70,000
2.	జి. తులసిరామ్, 5/9, బి.సి. కాలనీ, సున్నంపల్లి, ఓబులదేవరచెరువు మం॥, శ్రీ సత్యసాయి జిల్లా.	41231892344	1,52,000
	కదిరి బ్రాంచ్ మేనేజర్, మొబైల్ నెం. 9959550014		
3.	సొప్పరం ఈశ్వరప్ప, డి.నెం. 3/9, హనుమంతరావుపల్లి, కదిరికుంటపల్లి, కదిరి, శ్రీ సత్యసాయి జిల్లా.	39642029238	80,000
	కంబదూరు బ్రాంచ్ మేనేజర్, మొబైల్ నెం. 9004667899		
4.	మాధవి భర్త భాస్కర్, డి.నెం.4-87, కె.బసాపురపల్లి కంబదూరు మండలం, అనంతపురము జిల్లా.	39639875913	1,52,242
5.	యం. మహబూబ్ సాబ్ తండ్రి మస్తాన్ (లేట్), డి.నెం.1-98, రాళ్ళపల్లి, రాళ్ళఅనంతపురము, కంబదూరు మం॥, అనంతపురము జిల్లా.	39484653494	77,478
	కనగానపల్లి బ్రాంచ్ మేనేజర్, మొబైల్ నెం. 9959550041		
6.	చింతకాయల సరోజమ్మ భర్త నాగరాజు, బి.సి. కాలనీ, తగరకుంట గ్రా॥, కనగానపల్లి మం॥	41538419141	20,000

వేలం షరతులు: 1) వేలం నందు పాల్గొనదలచినవారు రూ॥ 10,000/-లు ధరావత్తు కట్టి వేలములో పాల్గొనవలెను. 2) హెచ్చు పాటదారుడు మొత్తమును అదే రోజు నగదును చెల్లించి నగలను పొందవలెను. 3) ఈ ఖాతాదారుడు మరణించిన యెడల అతని వారసులకు ఈ ప్రకటన పూర్వకముగా తెలియపరచినట్లుగా భావించవలెను. 4) అప్పు వసూలు నోటీసు అందనివారు మరియు నోటీసు తిరస్కరించినవారు ఈ ప్రకటన తుది నోటీసుగా భావించి వేలం తేదీలోగా సొమ్ము చెల్లించవచ్చును 5) వేలం ద్వారా వచ్చిన సొమ్ము బాకీ మొత్తమునకు సరిపోనియెడల చట్టరీత్యా చర్యలు తీసుకొని మిగిలిన బాకీ మొత్తము రాబట్టుకొనబడును 6) వేలం పాటలో పాల్గొనదలచినవారు ఏదైనా ఫోటో గుర్తింపు కార్డుతో రావలెను. 7) ఇందలి ఖాతాదారు నకు ఏ ఇతర రుణములు ఉన్నచో మిగిలిన సొమ్ము ఆ ఖాతాకు సర్దుబాటు చేయబడును. 8) ఈ ప్రకటనకు అయ్యే ఖర్చు పైన తెలిపిన ఖాతాదారుని నుంచి వసూలు చేయబడును. 9) నగల బరువునకు, నాణ్యతకు, బ్యాంకువారికి పూచిలేదు.

గమనిక : ఏ విధమైన కారణం చూపకుండానే షరతులు మార్చుకొనుటకుగానీ, వేలం వాయిదా వేయుటకుగానీ, వేలం రద్దు చేయుటకు గానీ ఆయా బ్యాంకు మేనేజర్ల గారికి పూర్తి అధికారము కలదు.

తేది : 22-09-2023 సం/- రీజనల్ మేనేజర్
స్థలం : ధర్మవరం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, R.B.O-4, ధర్మవరం

ప్రజలకు పోషకాహారం!

- ఆరోగ్య సంరక్షణపై సర్కారు ప్రత్యేక దృష్టి
- జిల్లాలో ప్రతినెలా 5.61 లక్షల కార్డుదారులకు ఉచితంగా ఫోర్టిఫైడ్ బియ్యం
- రాగులు, చక్కెర, గోధుమ పిండి కూడా పంపిణీ



వాహనం ద్వారా ఇంటి వద్దే బియ్యం పంపిణీ చేస్తున్న సిబ్బంది

పుట్టపర్తి అర్బన్: ప్రజారోగ్య పరిరక్షణలో రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడా వెనకడుగు వేయడం లేదు. పేదలకు నెలానెలా ఉచితంగా ఫోర్టిఫైడ్ (పోషక విలువలుగల) బియ్యం అందిస్తోంది. దీంతోపాటు చక్కెర, రాగులు, గోధుమ పిండి పంపిణీ చేస్తోంది. బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచే సీఎం వైఎస్ జగన్ పౌరసరఫరాల శాఖలో సమూల మార్పులు తీసుకొచ్చారు. చౌకదుకాణాల నుంచి బియ్యం తీసుకెళ్లడంలో ప్రజలు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో దేశంలోనే ఎక్కడా లేని విధంగా ప్రత్యేకంగా ఎండీయూ వాహనాలను ఏర్పాటు చేశారు. ఇళ్ల వద్దకే వెళ్లి నిత్యావసరాలు పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నారు. వాహనాల్లో డ్రైవర్, ఒక కూలీని ఏర్పాటు చేసి ఉపాధి కల్పించారు.

గత ఇబ్బందులన్నీ దూరం..

గతంలో సంచులు, డబ్బు, కార్డు తీసుకొని క్యూలో నిలబడి బియ్యం కొనుగోలు చేయాల్సి వచ్చేది. నెలలో 15 రోజుల పాటు పేదలకు తిప్పలు పడాల్సి వచ్చేది. నిత్యావసరాలు లభించే వరకూ పేదలు కూలి పనులు వదులుకోవాల్సి వచ్చేది. పోనీ ఇంతా చేసినా నాణ్యమైన బియ్యం అందేదా అంటే అదీ లేదు. అన్నీ పుచ్చులే..సచ్చులే. ఇలాంటి బాధలన్నింటికీ ఫుల్‌స్టాప్ పెడుతూ నేడు వైఎస్ జగన్ ప్రభుత్వం ఇంటికే నాణ్యమైన బియ్యం అందిస్తుండడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో బియ్యం కార్డులు	5,61,920
అన్నపూర్ణ కార్డులు	1,843
చౌకదుకాణాలు	1,367
ఎండీయూ వాహనాలు	349
పంపిణీ చేసే బియ్యం	8,300 మెట్రిక్ టన్నులు
గోధుమ పిండి	1,400 మెట్రిక్ టన్నులు
రాగులు	560 మెట్రిక్ టన్నులు
చక్కెర	280 మెట్రిక్ టన్నులు

ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం..

ఫోర్టిఫైడ్ రైస్‌తో పాటు తక్కువ ధరకే చక్కెర, గోధుమ పిండిని సర్కారు అందజేస్తోంది. బియ్యం వద్దనుకుంటే అందుకు బదులుగా కిలో నుంచి మూడు కిలోల వరకూ రాగులు కూడా పంపిణీ చేస్తున్నారు. ఇక చక్కెర అర కిలో రూ.17 (మార్కెట్‌లో రూ.22.50), గోధుమ పిండి కిలో రూ.16 (మార్కెట్‌లో రూ.50) కే అందజేస్తుండడం గమనార్హం. ప్రభుత్వ ఆశయాలకనుగుణంగా రేషన్ పంపిణీని ప్రత్యేక దృష్టితో అధికారులు పర్యవేక్షిస్తున్నారు. నిత్యావసరాలు అధిక ధరలకు విక్రయించకుండా, తూకాల్లో మోసాలు జరగకుండా కట్టడి చేస్తున్నారు. బియ్యం నాణ్యంగా ఉండడంతో ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారు.

ఆలోచన గొప్పది



కుగ్రామాల్లో సైతం బియ్యం, చక్కెర, రాగులు ఇంటి వద్దకే వచ్చి అందజేస్తున్నారు. ఇది చాలా ఉత్తమమైన కార్యక్రమం. గతంలో రేషన్ కోసం ఎన్నో ఇబ్బందులు పడాల్సి వచ్చేది. వైఎస్ జగన్ ఆలోచన చాలా గొప్పది.
– ఆదినారాయణ, గంగిరెడ్డిపల్లి

పారదర్శకంగా పంపిణీ



జిల్లాలో బియ్యం పంపిణీ పారదర్శకంగా జరుగుతోంది. పేదలకు ఇబ్బంది లేకుండా ఇంటికే తీసుకెళ్లి అందజేస్తున్నారు. బియ్యాన్ని వృథా చేయకూడదు. ఫోర్టిఫైడ్ రైస్ చాలా ఆరోగ్యకరమైనవి. బియ్యం నీళ్లలో తేలియాడుతుండడం చూసి ప్రజలు ఆందోళన చెందకుండా అవగాహన కల్పిస్తున్నాం.
– వంశీకృష్ణారెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి

అన్నంటే అభిమానం



భార్గవ్ వీపుపై టాటూగా వేసుకున్న సీఎం జగన్ చిత్రానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

పరిగి: మండలంలోని పైడేటిలో నిర్వహించిన వినాయక నిమజ్జనం సందర్భంగా భార్గవ్ అనే యువకుడు తన వీపుపై సీఎం జగన్ చిత్రాన్ని టాటూగా వేయించుకున్నాడు. జై జగన్ అనే ట్యాగ్‌లైన్ అక్షరాలతో ఆకర్షణీయంగా ఉన్న చిత్రాన్ని స్థానికులు ఆసక్తిగా వీక్షించారు. ఈక్రమంలో భార్గవ్ వీపుపై చిత్రించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రానికి పలువురు యువకులు, స్థానికులు క్షీరాభిషేకం చేశారు. ఇదే వీడియో సోషల్ మీడియాలో కూడా వైరల్ అయింది.

పెళ్లి కావడం లేదని యువకుడి మనస్తాపం

- ఉరివేసుకొని ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న శివకుమార్

పరిగి: మండలంలోని బీచిగానిపల్లిలో శివకుమార్ (27) అనే యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్ఐ జయలత వివరాలమేరకు.. బీచిగానిపల్లిలో ఉంటున్న శివకుమార్ పెయింటింగ్ పనులకు వెళ్లేవాడు. అవివాహితుడైన శివకుమార్ కొన్నేళ్లుగా ఫిట్స్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈక్రమంలో పెళ్లి సంబంధాలు రాకపోవడంపై ఆవేదన చెందేవాడు. ఎంతకాలానికి పెళ్లి కాకపోవడంపై జీవితంపై విరక్తి చెంది గురువారం రాత్రి ఇంటి పైకప్పుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్ఐ జయలత సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి తండ్రి మల్లప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మహా నగర సంకీర్తన



భక్తులతో కలసి భజన చేస్తున్న ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే.రత్నాకర్‌రాజు

ప్రశాంతి నిలయం: పర్తియాత్రలో భాగంగా మెదక్, సంగారెడ్డి జిల్లాలకు చెందిన సత్యసాయి భక్తులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో పుట్టపర్తి పట్టణంలో మహా నగర సంకీర్తన నిర్వహించారు. హనుమాన్ సర్కిల్‌లో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్‌రాజు మహా నగర సంకీర్తనను ప్రారంభించి భక్తులతో కలసి భజనలు చేశారు. సత్యసాయి దివ్య రథాన్ని ఊరేగిస్తూ భక్తి గీతాలు, కోలాటం, చెక్క భజనలతో భక్తులు ముందుకు సాగారు. వందలాది భక్తుల సమూహంగా నిర్వహించిన మహానగర సంకీర్తనతో పట్టణంలో సందడి నెలకొనింది. పట్టణ పురవీధుల గుండా సాగిన మహానగర సంకీర్తన ప్రశాంతి నిలయం తూర్పు ద్వారం వద్ద ముగిసింది.



కోలాటమాడుతున్న భక్తులు

కటకటాల వెనక్కి 'రైలు దొంగ'



పట్టుబడిన దొంగతో జీఆర్పీ అధికారులు

అనంతపురం సిటీ: రైలు ప్రయాణికులే లక్ష్యంగా దోపిడీలకు పాల్పడే దొంగను అనంతపురం జీఆర్పీ పోలీసులు అత్యంత చాకచక్యంగా పట్టుకున్నారు. కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా దేవదుర్గ తాలూకా మాసరకల్ మండలం తేగ్గిహాళ్ గ్రామానికి చెందిన రంగయ్య కుమారుడు నాగప్ప (29)ను అరెస్టు చేసి, అతని నుంచి 38 గ్రాముల బంగారు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు జీఆర్పీ ఎస్ఐ విజయకుమార్ తెలిపారు. బెంగళూరులో ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగించే నాగప్ప ఖాళీ సమయాల్లో రైళ్లల్లో వెళ్లే ప్రయాణికులను లక్ష్యంగా చేసుకొని వారి విలువైన వస్తువులు, ఆభరణాలు, నగదును కొట్టేసేవాడన్నారు. ఈ నేపథ్యంలో అతని కోసం వివిధ ప్రాంతాల పోలీసులు గాలిస్తుండగా గుంతకల్లు రైల్వే ఎస్పీ చౌడేశ్వరి, డీఎస్పీ అబ్దుల్ అజీజ్‌కు వచ్చిన పక్కా సమాచారం మేరకు ధర్మవరం సీఐ నాగరాజు, తమ సిబ్బందితో కలసి అనంతపురంలోని ప్లాట్‌ఫాం-4లో అనుమానాస్పద స్థితిలో తిరుగుతున్న నాగప్పను వలపన్ని పట్టుకున్నట్లు చెప్పారు. అనంతరం అతన్ని గుంతకల్లు కోర్టుకు తరలించినట్లు వెల్లడించారు.

జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి



ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

పుట్టపర్తి అర్బన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ కృష్ణయ్య ,డీపీహెచ్ఎన్ఓ వీరమ్మ పేర్కొన్నారు. శుక్రవారం పుట్టపర్తి మండలం పెడపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వారు పరిశీలించి మాట్లాడారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఇంటింటి సర్వేలో కుటుంబ సభ్యులందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. 30 సంవత్సరాల వయస్సు దాటిన వారందరికీ బీపీ, షుగర్, ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నా పరీక్షించుకోవచ్చన్నారు. ఇంటింటికీ వచ్చే ఆరోగ్య సిబ్బందికి ప్రజలు సహకరించాలన్నారు. ప్రజలు ముఖ్యంగా వ్యక్తి గత ఆరోగ్యంతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. మంచి పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ నగేష్, ఎంఎల్‌హెచ్‌పీ రాధ, ఆరోగ్య కార్యకర్త సుస్మిత, సిబ్బంది పద్మావతి, వాణిబాయి తదితరులు ఉన్నారు.

జింక మృతి



మృతి చెందిన జింక

తనకల్లు: మండల పరిధిలోని ఈతోడు సోలార్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జింక మృతి చెందింది. వివరాలు... ఈతోడు గ్రామానికి చెందిన నాగార్జునరెడ్డి వ్యక్తిగత పనిమీద తనకల్లుకు బైక్‌లో బయలుదేరాడు. అయితే సోలార్ ప్లాంట్ వద్దకు రాగానే జింక వేగంగా దూసుకొచ్చి బైక్‌ను ఢీ కొంది. దీంతో ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో నాగార్జునరెడ్డికి గాయాలయ్యాయి. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జింక అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న ఫారెస్టు అధికారులు జింక మృతిదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టంకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- కారుకు నిప్పు పెట్టిన మృతుని బంధువులు

బుక్కరాయసముద్రం: మండలంలోని అనంతపురం మార్కెట్ యార్డు సమీపంలోని కేటీఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. అనంతపురం వన్‌టౌన్ పోలీసుల వివరాల మేరకు... బీకేఎస్ మండల కేంద్రంలోని విరూపాక్షేశ్వర కాలనీకి చెందిన బెస్త తిమ్మయ్య కుమారుడు బెస్త భాస్కర్ (40) డ్రైవర్ పని చేస్తున్నాడు. అతనికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. భాస్కర్ సొంత పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంలో అనంతపురం నగరంలో నుంచి కేటీఆర్ ఫంక్షన్ హాలు సమీపంలోని బళ్లా పెట్రోలు బంక్ వద్ద విరూపాక్షేశ్వరనగర్ కాలనీలోకి యూటర్న్ తీసుకుంటుండగా గుత్తి వైపు నుంచి వేగంగా వస్తున్న కారు భాస్కర్ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొంది. ఈ ప్రమాదంలో భాస్కర్ అక్కకక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మృతుని బంధువులు, కాలనీ వాసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆగ్రహంతో కారుపై పెట్రోలు పోసి నిప్పు పెట్టారు. అయితే కేసు ఎవరి పరిధిలోకి వస్తుందన్న విషయంపై వన్‌టౌన్, బీకేఎస్ పోలీసులు తర్జన భర్జన పడటం గమనార్హం. వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టిప్పర్ ఢీకొని వృద్ధుడి మృతి

పెద్దపప్పూరు: యాడికి మండలంలోని రాయలచెరువు నుంచి వేములపాడు గ్రామానికి వెళ్లే జాతీయ రహదారిలో మోడల్ స్కూల్ వద్ద శుక్రవారం ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ ఢీకొంది. ఈ సంఘటనలో పక్కీరప్ప (72) మృతి చెందాడు. వివరాలు.. తూట్రాళ్లపల్లి గ్రామానికి చెందిన పక్కీరప్ప కూలిపనికి వెళ్లి తిరిగి ఇంటికి బైక్‌పై వస్తున్నాడు. అయితే వెనుక వైపు నుంచి ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన పక్కీరప్పను స్థానికులు 108 వాహనం ద్వారా తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ పక్కీరప్ప మృతి చెందాడు. మృతుడి భార్య నాగమ్మ కొన్నేళ్ల క్రితమే మృతి చెందగా, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. వారందరికీ వివాహాలు అయ్యాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు యాడికి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పంట లెక్క.. ఇక పక్కా!

- జోరుగా ఈ- క్రాప్ నమోదు
- 3.63 లక్షల హెక్టార్లలో పంటల సాగు
- ఇప్పటికే 2.70 లక్షల హెక్టార్లలోని ఈ-క్రాప్ పూర్తి
- ప్రత్యామ్నాయ పంటలకూ అవకాశం



ఈ-క్రాప్ నమోదును సూపర్ చెక్ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు

పుట్టపర్తి అర్బన్: ఖరీఫ్‌లో సాగుచేసిన పంటల లెక్క పక్కాగా తేలనుంది. పంటరుణాలు, సున్నావడ్డీ, పెట్టుబడి రాయితీ, పంటల బీమా తదితర ప్రయోజనాలు పొందాలంటే ఈ-క్రాప్ తప్పనిసరిగా చేయించాలని ప్రభుత్వం ఆదేశించింది. అలాగే ఈ-క్రాప్ నమోదు వల్ల పంటలు ఏ మేరకు సాగులో ఉన్నాయి..., ఎరువులు ఎంతమేర తెప్పించాలి, పంటలు నష్టపోతే ఎంత మేర పరిహారం ఇవ్వాలనే దానిపై స్పష్టత వస్తుంది. దీంతో ప్రభుత్వం ఈ-క్రాప్‌ను తప్పని సరి చేసింది. దీంతో ఖరీఫ్‌లో సాగుచేసిన ప్రతి పంటనూ వ్యవసాయాధికారులు, సిబ్బంది ఈ-క్రాప్ నమోదు చేస్తున్నారు. ఈ సారి వర్షాభావ పరిస్థితులతో చాలా మంది రైతులు వేరుశనగకు ప్రత్యామ్నాయంగా ఇతర పంటలు సాగు చేశారు. దీంతో అధికారులు ఇప్పటికే సాగులోకి వచ్చిన వేరుశనగతో పాటు ప్రత్యామ్నాయ పంటలైన కంది, ఆముదం, మొక్కజొన్న తదితర పంటలకు ఈ- క్రాప్‌లో నమోదు చేస్తున్నారు.

75 శాతం పంటల వివరాల నమోదు..

ప్రభుత్వం ఈ ఖరీఫ్ నుంచి మెట్టపంటలతో పాటు ఉద్యాన పంటలు, మల్బరీ, డ్రిప్పు, స్ప్రింక్లర్లకు సైతం ఈ-క్రాప్‌లో నమోదు చేయిస్తోంది. ప్రస్తుతం జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన పంటలన్నీ కలిపి 3,63,155 హెక్టార్లలో సాగులోకి రాగా, ఇప్పటి వరకూ 75 శాతం అంటే 2.70 లక్షల హెక్టార్ల పంటల వివరాలను అధికారులు ఈ-క్రాప్‌లో నమోదు చేశారు. పంటల నమోదులోనూ అధికారులు పూర్తి పారదర్శకత పాటిస్తున్నారు. జిల్లా వ్యవసాయాధికారి, శాస్త్రవేత్తలు కొన్ని గ్రామాల్లో పర్యటించి సిబ్బంది నమోదు చేసిన వివరాలన్నీ పక్కాగా ఉన్నాయా..., లేదా అని సూపర్ చెక్ చేస్తున్నారు.

నెలాఖరు వరకూ అవకాశం..

ప్రత్యామ్నాయ పంటల సాగు చేసే రైతులకు ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో ఉలవ, పెసర, అలసంద, తదితర విత్తనాలను అందజేసింది. వీటిని సాగు చేసిన 20 రోజుల తరువాత ఈ-క్రాప్ నమోదు చేయనున్నారు. ఈనెలాఖరు నాటికి ఈ-క్రాప్ నమోదు వంద శాతం పూర్తి చేయాలన్న ఉన్నతాధికారుల ఆదేశాల నేపథ్యంలో వ్యవసాయ సిబ్బంది ఈ-క్రాప్ నమోదు వేగవంతం చేశారు. అనంతరం ఆర్బీకేల్లో రైతుల చేత ఈ-కేవైసీ చేయిస్తున్నారు. దీనివల్ల పీఎం కిసాన్, రైతు భరోసా పథకాలకు ఇబ్బంది ఉండదు. అక్కడ బటన్ నొక్కగానే రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుంది. అక్టోబర్ 5 నుంచి 10వ తేదీలోపు ఈ-క్రాప్ వివరాలను ఆయా ఆర్బీకేల్లో జాబితా ప్రదర్శించి, పంటల వివరాల నమోదులో తేడాలపై ఫిర్యాదులు అందితే అక్టోబర్ 15వ తేదీలోపు సరిదిద్దాలని వ్యవసాయశాఖ సిబ్బంది ప్రణాళిక సిద్ధం చేశారు.

రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలి



రైతులు పంటలు సాగు చేసిన తర్వాత స్థానిక రైతు భరోసా కేంద్రాల్లో తెలియజేసి ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలి. దీనిపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని ఆర్బీకే సిబ్బందిని ఇప్పటికే ఆదేశించాం. వ్యవసాయ, ఉద్యాన, పంటలతో పాటు డ్రిప్పు, స్ప్రింక్లర్లను సైతం ఈ-క్రాప్‌లో నమోదు చేయించాలి.
– సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారి

పరిశ్రమల ఏర్పాటుతో నైపుణ్యాభివృద్ధి



సదస్సుకు హాజరైన అధికారులు, వివిధ కంపెనీల ప్రతినిధులు

- తిరుపతి రీజియన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ట్రైనింగ్ కె.ఆనందరావు

రాప్తాడురూరల్: పరిశ్రమల ఏర్పాటుతో నైపుణ్యాభివృద్ధి సాధ్యమవుతుందని తిరుపతి రీజియన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ట్రైనింగ్ కె.ఆనందరావు పేర్కొన్నారు. శుక్రవారం అనంతపురంలోని బాలుర ఐటీఐలో 'ఐటీఐ-పరిశ్రమల అనుసంధానం' అనే అంశంపై రాయలసీమస్థాయి సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆనందరావు మాట్లాడుతూ ఐటీఐల్లో నేర్పించే విద్యకు పరిశ్రమల్లో ఓజేటీ శిక్షణ ఇవ్వడంతో విద్యార్థులు ఎక్కువ నైపుణ్యం పొందుతారన్నారు. తద్వారా మంచి సంస్థల్లో ఉపాధి లభిస్తుందన్నారు. హాజరైన వివిధ పరిశ్రమల ప్రతినిధులు ఒక్కో ట్రేడ్‌ను దత్తత తీసుకుని నైపుణ్యాలు అందించాలని కోరారు. టాటాస్ట్రైవ్ ప్రతినిధి అభిషేక్ మాట్లాడుతూ ప్రస్తుతం 30 ఐటీఐలకు సేవలందిస్తున్నామన్నారు. ఐటీఐల్లో చదువుతున్న విద్యార్థులకు ఓజేటీ, డీఎస్‌టీ పద్ధతుల ద్వారా కంపెనీలతో అనుసంధానం చేస్తామన్నారు. కోర్సు పూర్తయ్యాక విద్యార్థులు ఉద్యోగాలు వెతుక్కునే అవసరం ఉండదన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి దాదాపు 56 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

₹3,000/- Govt. కంప్యూటర్ కోర్స్
■ గ్రూప్-IIలో నాన్-ఎగ్జిక్యూటివ్ జాబ్స్, P.C. మెయింటెనెన్స్, కంప్యూటర్ కోర్స్‌లకు దరఖాస్తులు. Q:10th, సీట్లు: 08, ఎగ్జామ్ డేట్: 16-10-2023, తత్కాల్‌తో 23-09-2023. సాయి ఇన్‌స్టిట్యూషన్, ATP. 9059723829. [A-776887]

REAL ESTATE

షాప్స్ అమ్మబడును
■ ATP, KLD రోడ్‌లో ఉన్న పాండ ఫ్యామిలీ రెస్టారెంట్ మరియు వందన శారీస్ & కిడ్స్‌వేర్ షాప్ అమ్మబడును. సెల్ : 9030309695, 9866012861. [A-776889]

COMMERCIAL SALE
■ Commercial Property for Sale Land Building 1428 Sq.yds 24500 Builtup Area at Saidabad,Hyd. Rent getting 5 Lakhs. Ph: 9849090098 [HA-346]

WANTED
■ Admin Role కి (M/FM) కావలెను. అర్హత : ఏదైనా డిగ్రీ, అడ్రస్ : అనంతపురము టౌన్, 1వ రోడ్డు, పొట్టిశ్రీరాములు స్కూల్ దగ్గర, సెల్ : 8309988784. [A-1167]
■ ప్రముఖ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారి Central Govt Project Work & Franchise చేయుటకు యువతీ యువకులు కావలెను. Qualification : Inter, Degree cont :9000977523,8125797853 [A-1168]
■ "జాబ్ గ్యారెంటీ" మా కంపెనీ కొరకు మహిళలు /పురుషులు అర్జెంటుగా కావలెను. జీతం: 20,000/- వరకు, ఫ్రీ రూం+భోజనం, మ్యాన్ పవర్ ఏజెంట్స్ కావలెను.(5 వేల వరకు కమీషన్) 9346605007. [H-793351]
■ స్టార్ హోమ్‌కేర్ HYD వృద్ధులకు, పేషెంట్లకు సేవ చేయుటకు, బేబీకేర్ ఇంటి/వంట పనికి స్త్రీ/పు కావలెను. జీతం : 16,000/- నుండి 35,000/- రూం + భోజనం ఉచితం. ఫోన్: 94904 82881 [V-797355]
■ బాలాజీ గ్రూపు, VJA, HYD శ్రీమంతుల ఇళ్ళలో వృద్ధుల సేవకు వంట/ఇంటిపని, బేబీకేర్ వర్కర్స్ కావలెను. జీ. 15 to 22 వేలు. ఏజెంట్లకు కమీషన్ 5 వేలు ✆ 8639756214, 8639756217 [B-1068119]
■ ATP మెయిన్ సర్కిల్స్ నందు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. Q :10th పాస్, జీతం : 12 వేలు, EPF+ESIC కలదు. వయస్సు : 30-40 సం॥ డ్యూటీ 12 గం॥. ఫోన్ : 9381838140. [A-776888]
■ హరేకృష్ణ హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీతం: 18K. హైదరాబాద్: 9640258899, విజయవాడ: 9640648899 [HA-631]
■ రియల్‌ఎస్టేట్ ఏజెంట్లకు శుభవార్త: K5 రియల్ ఎస్టేట్ నందు పనిచేయుటకు ఏజెంట్స్ కావలెను. జీతం: 10000/-తో పాటు కమీషన్ ఇవ్వబడును. అనంతపురం. 9391613757, 9440244057 [G-7684]
■ మీ దగ్గర స్మార్ట్ ఫోన్ ఉంటే నిజాయితీగా మీ ఇంటినుండే వర్క్ చేస్తూ మా సపోర్ట్‌తో నెలకు అధిక ఆదాయం సంపాదించవచ్చు. ఇంటర్ పైన చదివి, 20-35 సం॥వారు, ఏలాంటి ఫీజు లేదు. ఫోన్: 81437 46028. [V-797413]
■ Hiring : Graphic designers - 3 no's with high efficient Skills, Interview Anchors with Pleasant looking Personality Female - 2, Male - 2, & Female Marketing executives - 2. NRI Digital Media, Anantapur.ph: 9494472722. [A-1170]
■ నోబుల్ హెల్త్‌కేర్ సర్వీసెస్ అనంతపురము నందు వృద్ధులు, బెడ్ రిడన్ పేషెంట్స్ పక్షవాతం పేషెంట్స్, బేబీ కేర్, కేర్ టేకర్స్ 24 గంటలు పనిచేయుటకు ఓర్పుగల ఆయాలు, నర్సులు ఆడ మరియు మగ కావలెను. వారికి ఆకర్షణీయమైన జీతం మరియు ఉచిత భోజనము వసతి సదుపాయం కలదు. వివరాలకు సంప్రదించవలసిన నెంబర్లు 9441018078, 6301341831. [A-7326]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.